# ప్రాసక్రీడలు

శ్రీ శ్రీ

ఏక్ దో తీన్ చార్
పాంచకడీ దేవు
వాడే వీడు వీడే వాడు
శ్రీనివాసరావు

*

రాసక్రీడ శృంగారానికి
రమ్యమైన ప్రాణం
ప్రాసక్రీడ హాస్యానికి
పసందైన బాణం

*

బర్మాలో అడవుల్లో
బలిసిందొక కుంజరం
బామ్మనడిగి చేయిస్తా
దాని కొక్క పంజరం

*

భాషాప్రయుక్తం రాష్ట్రరచన
దేశాని కరిష్టం
అసలు రహస్యం నెహ్రూ
కది చాలా కష్టం

తెలుగురాజ్య మేర్పడితే
తొలివజీరు రెడ్డి
తాగిందికి కుళ్లు నీళ్లు
తినడానికి గడ్డి

*

పాడిచేస్తామని చెప్పిన
మన కాంగ్రెసువారు
తడి రాష్ట్రాలన్నిటినీ
"పాడి" చేస్తున్నారు

*

ప్రజా శోష పార్టీలో
పాతబడ కేసరి
కలహానికి నారదముని
కడుపు కొక్క దాసరి

*

చిన్నా చిట్టీ అష్టా చెమ్మా
చిప్పా చిప్పా గోళ్లు
ఆకో చీకో లంకారాజా
అయితే గియితే వెళ్లు